క్లుప్తంగా

జీవీఎంసీ కాంట్రాక్టర్ల అసోసియేషన్ సమావేశం



మాట్లాడుతున్న రొంగలి జగన్నాథం

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ కాంట్రాక్టర్ల అసోసియేషన్ సర్వసభ్య సమావేశం బుధవారం అసోసియేషన్ అధ్యక్షుడు వీరారెడ్డి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో రాష్ట్ర కాంట్రాక్టర్ల వ్యవస్థాపక అధ్యక్షుడు రొంగలి జగన్నాథం పాల్గొని కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు. ప్రస్తుత కార్యవర్గం గడువు ముగియడంతో నూతన కార్యవర్గం ఏర్పాటుకు, 11 మంది సీనియర్ సభ్యులతో కూడిన కమిటీ వేసి, వారికి కార్యవర్గ సభ్యులను ఎంపిక చేయడానికి సర్వహక్కులు ఇస్తూ ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తామని, ఎన్నికల కమిటీ అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా చూస్తామన్నారు. సమావేశంలో వి. సత్యనారాయణ, కన్వీనర్ గొంప చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి రంది సాధూరావు తదితరులు పాల్గొన్నారు.

యువతకు క్విజ్ పోటీ



విజేతలతో క్విజ్ మాస్టర్ సూర్యారావు

సీతంపేట: ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు గ్రంథాలయ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం క్విజ్ పోటీ నిర్వహించారు. 60 మంది విద్యార్థులు ఎనిమిది గ్రూపులుగా ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ పోటీ పరీక్షలకు అవసరమైన వర్తమాన అంశాలు, చరిత్ర, సాంకేతిక, విజ్ఞానం, ఆర్థిక, రాజనీతి, భూగోళ శాస్త్రాలు మొదలైన విషయాలపై 60 ప్రశ్నలు అడిగారు. గ్రంథాలయ సహ కార్యదర్శి డి.వి.సూర్యారావు క్విజ్ మాస్టర్‌గా వ్యవహరించారు. విజేతలకు పుస్తకాలు బహుమతిగా అందజేశారు. పోటీ పరీక్షలకు వెళ్లే తమ సామర్థ్యాలు తెలుసుకోవడానికి ఇటువంటి క్విజ్ పోటీలు దోహదపడతాయని విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథం అవసరం

ఆరిలోవ: డాక్టర్ వీఎస్ కృష్ణా డిగ్రీ కళాశాలలో వర్ణపట శాస్త్రం, దాని ఆవశ్యకత అనే అంశంపై బుధవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రసాయన శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అన్నా వర్సిటీ సైంటిస్ట్ కృష్ణమూర్తి, కృష్ణా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు మాట్లాడుతూ విద్యార్థులకు సైన్స్ పట్ల శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలని సూచించారు. రసాయన శాస్త్రంలో భాగమైన వర్ణపట శాస్త్రం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు సైన్స్ విభాగం అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ భవనం పరిశీలన



హాస్టల్ మరమ్మతులపై చర్చిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థినుల వసతి గృహం ప్రగతి భవనాన్ని బుధవారం ఉదయం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి పరిశీలించారు. వచ్చే నెలలో విద్యార్థులు వచ్చే సమయానికి హాస్టల్ మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. హాస్టల్ గదులు, టాయిలెట్స్, డైనింగ్ రూమ్ వంటివి పూర్తి స్థాయిలో మరమ్మతులు పూర్తి చేసి, పెయింటింగ్ వేయాలని సూచించారు. నూతనంగా పలు గదులను నిర్మించే అంశంపై వార్డెన్ వినుత, యూనివర్సిటీ ఇంజినీర్ ఆర్.శంకరరావుతో చర్చించి, తగిన సూచనలు చేశారు. నిర్ణీత సమయానికి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

ప్రేమతో.. రాఖీ

అన్నాచెల్లెళ్ల అనురాగానికి ప్రతీక రాఖీ. సోదరుడు క్షేమంగా ఉండాలని సోదరి రక్షాబంధన్ రోజున రాఖీ కడుతుంది. ఆమెకు జీవితాంతం అండగా ఉంటానని సోదరుడు రాఖీ రోజున ఆమెకు భరోసా కల్పిస్తాడు. మన దేశంలో అనాదిగా వస్తున్న ఈ వేడుక సోదరి–సోదరుల ప్రేమకు చిహ్నంగా నిలుస్తోంది.



ప్రేమసమాజం కుష్టు నివారణ కేంద్రంలో రాఖీ వేడుక నిర్వహిస్తున్న స్వామి వివేకానంద సంస్థ సభ్యులు



కేజీహెచ్‌లో చెట్టుకు రాఖీ కడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్ తదితరులు

దాబాగార్డెన్స్ : రక్షాబంధన్ వేడుకలు బుధవారం నగరంలో వేడుకగా జరిగాయి. హిమా హ్యూమానిటేరియన్, ఒడిస్సా స్టీవ్‌డోర్స్, సింహాద్రి టీఎంటీ సంయుక్త ఆధ్వర్యంలో రక్షాబంధన్ సంబరాలు జిల్లా పరిషత్ సమీపాన రెడ్‌క్రాస్ సొసైటీ ఫంక్షన్ హాల్లో వేడుకగా నిర్వహించారు. హిమా హ్యూమానిటేరియన్ సంస్థ వ్యవస్థాపకుడు టీవీడీ దాస్‌కి కేజీహెచ్‌లోని పలువురు నర్సింగ్ చెల్లెళ్లు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్, ఆర్‌ఎంవో డాక్టర్ పి. అరుణాదేవి సమక్షంలో రాఖీ కట్టారు. కార్యక్రమంలో ఒడిస్సా స్టీవ్‌డోర్స్ వైస్ ప్రెసిడెంట్ జేకే నాయక్, విజేత ఆసుపత్రి అధినేత డాక్టర్ కె. కూర్మనాథ్, సింహాద్రి టీఎంటీ డైరెక్టర్ వీవీ కృష్ణారావు, టూటౌన్ క్రైమ్ ఏఎస్‌ఐ అల్లిపిల్లి అప్పారావు, మురళీకృష్ణ, చింతపల్లి శ్రీనివాస్, మహిళా సంఘాలు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రేమసమాజం కుష్టు నివారణ కేంద్రంలో..

ఏవీఎన్ కాలేజీ సమీపాన గల ప్రేమసమాజం కుష్టు నివారణ కేంద్రం వద్ద స్వామి వివేకానంద సంస్థ మహిళా సభ్యులు రాఖీ పండగ ఘనంగా నిర్వహించారు. కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న పలువురికి స్వామి వివేకానంద సంస్థ మహిళా సభ్యులు, ట్యూషన్ విద్యార్థులు రాఖీ కట్టి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రాఖీ పౌర్ణమి రోజున వీరికి ఎవరూ లేరన్న భావన కలగకుండా ఉండేందుకు తమ సంస్థ మహిళా సభ్యులు సోదర భావంతో రాఖీలు కట్టి, వారికి మేమున్నామని భరోసా కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో సంస్థ మహిళా సభ్యులు నాగమణి, భవానీ, సుజాత, రత్న, ఉమాదేవి, కనకమహాలక్ష్మి, అచ్యుత్, సంస్థ ట్యూషన్ విద్యార్థులు పాల్గొన్నారు.

అనుబంధాలకు ప్రతిరూపమే రాఖీ..

అనుబంధాలకు ప్రతిరూపమే రాఖీ పండగ అని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. రక్షాబంధన్ మహోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సోదరులకు రాఖీ కట్టే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మేయర్, బ్రహ్మకుమారీలు పలువురు మీడియా సోదరులకు రాఖీలు కట్టి, స్వీట్స్ తినిపించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ద్వాపర యుగం నుంచి ఈ అనుబంధం ఉందని, శ్రావణ మాసంలో వచ్చే పౌర్ణమి రోజే రాఖీ పండగ అని పేర్కొన్నారు. అక్క చెల్లెళ్లకు అన్నాదమ్ములు అండంగా ఉండాలన్నదే రాఖీ విశిష్టత అని పేర్కొన్నారు. బ్రహ్మకుమారీ రామేశ్వరి మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలు, పానీయాలు సేవిస్తూ మానసిక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. అటువంటి వారి కోసం సెప్టెంబర్ 2న భారత ప్రభుత్వం బ్రహ్మకుమారీల సహకారంతో మహారాణిపేటలో గల రాజయోగ మెడిటేషన్ సెంటర్లో అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో మేయర్‌తో పాటు ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ బుచ్చిరాజు, ముంబైకి చెందిన డాక్టర్ సచిన్ తదితరులు ప్రారంభించనున్నారని చెప్పారు. కార్యక్రమంలో మహేశ్వరరెడ్డి, సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడు గంట్ల శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కు రాఖీ కడుతున్న వెంకటేశ్వరమెట్ట మహిళలు

ఎమ్మెల్యేకు రాఖీ కట్టిన మహిళలు..

అల్లిపురం : అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ల అనుబంధానికి రాఖీ పండగ ప్రతీక. అటువంటి రాఖీ పండగను పురస్కరించుకుని వెంకటేశ్వరమెట్ట మహిళలు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌ను అతని క్యాంపు కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. తమ కష్టసుఖాల్లో అండగా నిలవాలని ఆకాంక్షించారు. వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ జిల్లా కార్యదర్శి బొడ్డేటి ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో..

మహారాణిపేట : నీడనిచ్చే చెట్ల వల్ల పర్యావరణం పరిరక్షింపబడుతుందని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ అన్నారు. బుధవారం వైజాగ్ నేచర్ క్లబ్ సంస్థ ప్రతినిధులు కేజీహెచ్‌ను సందర్శించి ఎక్కువ వయసు గల చెట్లకి రాఖీలు కట్టి వృక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేజీహెచ్‌లో పలు వృక్షాలకు సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ కుమార్ రాఖీలు కట్టారు. ఈ వృక్షాలను కొనసాగించాలని, వృక్షాలు, మనుషులు పరస్పరం ఒకరిపై ఒకరు ఆధారపడి జీవిస్తారని వైజాగ్ నేచర్స్ క్లబ్ ప్రతినిధి భట్టాచార్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్‌ఎంవో డాక్టర్ అరుణాదేవి, చీఫ్ డైటీషియన్ రమణమూర్తి, ఉద్యోగులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



మెడిటేషన్ కార్యక్రమాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మేయర్, బ్రహ్మకుమారీలు



దాస్‌ను సత్కరిస్తున్న కేజీహెచ్ ఆర్‌ఎంవో డాక్టర్ అరుణాదేవి తదితరులు

రాష్ట్రానికి రక్ష.. జగనన్నే

జగదాంబ : రాష్ట్రానికి జగనన్నే రక్షణ అని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. బుధవారం రాఖీ పండగ నేపథ్యంలో జీవీఎంసీ 39వ వార్డు క్వీన్ మేరీ స్కూల్‌లో విద్యార్థులతో 'మారక్ష' అనే కార్యక్రమం నిర్వహించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి రాఖీలు కట్టిన విద్యార్థులు జగనన్నే మారక్ష అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో రూ. 70 వేల కోట్లు కేవలం విద్యకే కేటాయించారని అన్నారు. నాడు–నేడు కింద పాఠశాలలు అభివృద్ధి చేశారన్నారు. డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, అమ్మఒడి, జగనన్న విద్యా కానుక, ట్యాబ్స్, ఆహ్లాదకర వాతావరణం, బాత్‌రూమ్‌లు, విద్యార్థులకు పౌష్టికాహారం, క్రీడలు వంటి అన్ని సౌకర్యాలు కల్పించారన్నారు. అనంతరం విద్యార్థులు రాఖీ ఆకారంలో మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వైఎస్సార్‌సీపీ మహిళా నేతలు ఎమ్మెల్యే వాసుపల్లికి రాఖీలు కట్టి స్వీట్స్ తినిపించారు. ఈ కార్యక్రమంలో కనకమహాలక్ష్మి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, 35వ వార్డు కార్పొరేటర్, అధ్యక్షుడు విల్లూరి భాస్కరరావు, అలపన కనకరెడ్డి, సన్యాసిరావు, దశమంతుల మాణిక్యాలరావు, జేసీఎస్ ఇన్‌చార్జి కోన శంకర్, స్టేట్ డైరెక్టర్ సబిరాబేగం, అనురాధ, బెహరా వెంకటరత్నం, ముజీబ్‌ఖాన్, ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ బోని దేవ, వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివిష్ణు, లండా రమణ, బొగ్గుశ్యామ్, శ్రీనురెడ్డి, బాబ్జి, నీలాపు రావు, ఇబ్రహీం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కు రాఖీ కడుతున్న విద్యార్థులు

నేడు సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

14వ రోజుకి చేరిన శ్రావణలక్ష్మి పూజలు

కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి పూజలు బుధవారం 14వ రోజుకి చేరాయి. ఉదయం 8 గంటలకు వేద మంత్రాలు, నాదస్వరాల నడుమ ప్రారంభమైన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టు ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు చేసి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. శ్రావణలక్ష్మి పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.400 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ఈవో కె. శిరీష తెలిపారు. పూజలకు సంబంధించి వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ర్యాంప్ నిర్మాణం పట్ల స్థానికుల హర్షం



పూర్తయిన ర్యాంప్ వద్ద గ్రావెల్ వేస్తున్న దృశ్యం

జగదాంబ : ఎస్ఎల్ కెనాల్ వద్ద నిర్మిస్తున్న ర్యాంప్ పనులు పూర్తయ్యాయి. జీవీఎంసీ 35వ వార్డు పోర్టు వద్ద ఉన్న ఎస్ఎల్ కెనాల్‌లో తరచూ పూడిక పేరుకుపోవడంతో స్థానికులు నానా అగచాట్లు పడుతున్నారు. వర్షం పడితే నీరు ఎగువకు ప్రవహించకుండా రహదారులు, ఇళ్లలోకి చేరిపోతుంది. ఇటీవల మూడు రోజుల పాటు కురిసిన వర్షాలకు కూడా ఇదే పరిస్థితి తలెత్తి ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఈ నేపథ్యంలో జేసీబీ సాయంతో పూడిక తొలగించి పోర్టు ప్రధాన ద్వారం పక్కన సిమెంట్‌తో ర్యాంప్ నిర్మించారు. దీనివల్ల చెత్త, పూడిక తొలగించేందుకు ఈ ర్యాంప్ ఉపయోగపడుతుంది. జీవీఎంసీ ఏర్పాటు చేసిన ఈ ర్యాంప్ పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బాబాజీకొండపై శ్రావణ పౌర్ణమికి ప్రత్యేక ఏర్పాట్లు



ఇసుక కొండపై వెలసిన రమా సహిత సత్యనారాయణ స్వామి



ఘాట్‌రోడ్డులో పెండాల్స్ ఏర్పాట్లు

- పెద్ద ఎత్తున తరలి రానున్న భక్తులు

దాబాగార్డెన్స్ : అన్నవరం సత్యదేవుడి అంతటి ప్రాధాన్యత గల ఇసుకకొండ(బాబాజీకొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో రాఖీ (శ్రావణ) పౌర్ణమికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు. భక్తుల సౌకర్యార్థం సర్వదర్శనంతో పాటు రూ.20, రూ.200, రూ.300 టికెట్లు అందుబాటులో ఉంచారు. మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశారు. జిల్లా నలుమూలల నుంచే గాక ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు తరలి రానున్నారు. ముందుగా చాలా మంది భక్తులు సాగరతీరంలో స్నానమాచరించి స్వామి దర్శనానికి రానున్నారు. వేకువ జాము 4 గంటల నుంచే భక్తులు తరలి రానున్న దృష్ట్యా చర్యలు చేపట్టారు. వేకువజాము 4 గంటలకు అనివెట్టి మండపం వద్ద సామూహిక వ్రతాలు, ప్రత్యేక పూజలు జరపనున్నారు. ధ్వజస్తంభ పూజలు జరగనున్నాయి. ఉదయం 7 గంటల నుంచి ఆలయ మండపంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో బుద్ధ మహాలక్ష్మి నగేష్ తెలిపారు.

కల్వర్టు పనులు త్వరితగతిన పూర్తి చేయండి

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ 28వ వార్డులో చేపడుతున్న కల్వర్టు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా జోన్–4లోని 28, 31 వార్డుల పరిధి సంతోషిమాత కాలనీ, పితానిదిబ్బ, భానోజీనగర్, నెహ్రూనగర్, నీలమ్మ వేపచెట్టు ఏరియా తదితర ప్రాంతాల్లో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సంతోష్‌నగర్ కాలనీ, నెహ్రూనగర్‌లో నిర్మిస్తున్న కల్వర్టు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. వార్డులో పారిశుధ్య పనులు మెరుగుపరచుకోవాల్సిన అవసరం ఉందని, వార్డులో వ్యర్థాలు అధికంగా కనిపిస్తున్నాయని కమిషనర్ శానిటరీ కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యర్థాలు కనిపిస్తే ఇకపై ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. భానోజీనగర్‌లో సామాజిక మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉన్నాయని, వాటి స్థానంలో సామాజిక భవనం నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దుర్గారావు కమిషనర్ దృష్టికి తీసుకురాగా, కమిషనర్ పరిశీలిస్తామన్నారు. 31వ వార్డులో చాలా వరకు రోడ్లు, కాలువలు శిథిలావస్థలో ఉన్నాయని, వాటిని పునర్నిర్మించాలని, నీలమ్మ వేపచెట్టు వద్ద ఉన్న డస్ట్‌బిన్‌ను తొలగించాలని, అలాగే రోడ్డుకిరువైపులా ఉన్న ఆక్రమణలు, భవన నిర్మాణ వ్యర్థాలు తొలగించాలని వార్డు కార్పొరేటర్ బిపిన్ కుమార్‌జైన్ కమిషనర్‌కు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ప్రణాళికా అధికారి సునీత, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, జోనల్ కమిషనర్ శివప్రసాద్, పర్యవేక్షక ఇంజినీరు సత్యనారాయణరాజు, కార్యనిర్వాహక ఇంజినీరు రమణమూర్తి, ఏఎంవోహెచ్ చుక్కల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



28వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి అప్పలకొండతో కలిసి పర్యటిస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ



కమిషనర్‌కు సమస్యలు వివరిస్తున్న 31వ వార్డు కార్పొరేటర్ బిపిన్‌కుమార్‌జైన్

ఎరుకుమాంబకు భక్తుల జలాభిషేకం

సీతమ్మధార: జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తిలో వెలసిన శ్రీ ఎరుకుమాంబ అమ్మవారికి భక్తులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి బుధవారం దొండపర్తి, రైల్వే న్యూకాలనీ, పెదవాల్తేరు, మద్దిలపాలెం, అక్కయ్యపాలెం, శివాజీపాలెం, ఎన్ఏడి, సీతమ్మధార, నక్కవానిపాలెం, రేసపువానిపాలెం, జగదాంబ, వన్‌టౌన్, నెహ్రూబజార్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి అమ్మవారికి పూజలు చేయటం పరిపాటి. ఈ సందర్భంగా భక్తులు పసుపు నీళ్లతో అమ్మవారికి జలాభిషేకం చేశారు. ప్రధాన అర్చకులు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉదయం పంచామృతాభిషేకంతో పూజలు చేశారు. సాయంత్రం పసుపు, కుంకుమ, పూలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న ఈవో రమాబాయి, భక్తులు

ఉత్తమ ఉపాధ్యాయురాలికి అభినందన

ఏయూ క్యాంపస్: జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైన నౌకానగర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు ఎం.ఉమాగాంధీని విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అభినందించారు. బుధవారం పాఠశాలను సందర్శించిన ఆయన అవార్డుకు ఎంపికైన ఉమాగాంధీకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మి, పార్టీ నాయకులు మొల్లి అప్పారావు, మువ్వల సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ విద్యార్థుల మనసులను ఆకట్టుకునే విధంగా బోధన పటిమతో జాతీయ స్థాయిలో అవార్డును సాధించడం గర్వకారణమన్నారు. ఇటువంటి అవార్డులు మరింత స్ఫూర్తిని ఇస్తాయన్నారు. భవిష్యత్తులో మరిన్ని అవార్డులు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.



ఉపాధ్యాయురాలు ఉమాగాంధీని సత్కరిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

అలరించిన సినీ సంగీత విభావరి

సీతంపేట: భూషణ్ బ్రదర్స్ కల్చరల్ అండ్ ఆర్ట్స్ అసోసియేషన్ 31వ వార్షికోత్సవం సందర్భంగా ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో బుధవారం అభినవ తారవో శీర్షికన నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆద్యంతం అలరించింది.

సామాజిక భవనం ప్రారంభం

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు రేసపువానిపాలెంలో రూ.20 లక్షలతో నిర్మించిన సామాజిక భవనాన్ని బుధవారం కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ఆధ్వర్యంలో మేయర్ గొలగాని హరివెంకటకుమారి, నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి అభివృద్ధి పథంలో విశాఖ దూసుకుపోతోందన్నారు. కె.కె.రాజు మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ ఫలాలతోపాటు అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. నూతన సచివాలయ భవనాలు, అంగన్‌వాడీ భవనాలు, కమ్యూనిటీ హాళ్లు నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, జోన్–3 కమిషనర్ విజయలక్ష్మి, ఈఈ శ్రీనివాస్, డీఈ శ్రీనివాసరాజు, ఏఈ శ్రీరామ్మూర్తి, మాజీ కార్పొరేటర్ జి.వి.రమణి, సీనియర్ నాయకులు, గ్రామ పెద్దలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

రేసపువానిపాలెంలోని పలు కాలనీల్లో రూ.60 లక్షలతో చేపట్టనున్న డ్రైనేజీలు, రోడ్లు, అదనపు భవన నిర్మాణ పనులకు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ఆధ్వర్యంలో మేయర్ గొలగాని హరివెంకటకుమారి, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు శంకుస్థాపన చేశారు.



రేసపువానిపాలెంలో కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న మేయర్ హరివెంకటకుమారి

ఆకట్టుకున్న కథా కచేరీ

సీతంపేట: సహృదయ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో నిర్వహించిన కథా కచేరీ వైవిధ్యమైన అంశాంతో అందరినీ అలరించింది. సంస్థ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ కథలతో మానసిక వికాసం కలుగుతుందన్నారు. రచయితలు తమ కథల ద్వారా మానవాళికి మమత, మానవత్వపు పరిమళం, మానవీయ విలువలు సమాజానికి చాటిచెప్పాలన్నారు. డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ రచయితకు తను చెప్పే విషయంపై నిర్దిష్ట అభిప్రాయం ఉండాలన్నారు. కథలను సమీక్షించారు. రచయిత మేడా మస్తాన్‌రెడ్డి మాట్లాడుతూ కథకులకు కథలు వినిపించడానికి అవకాశం కల్పించినందుకు సహృదయ సాహితికి ధన్యవాదాలు తెలిపారు. కథా కచేరి ద్వారా ఎందరో రచయితలను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. అనంతరం రచయితలు కె.వి.ఎస్.మూర్తి, భాగవతుల సత్యనారాయణ మూర్తి, చిన్న సూర్యనారాయణ, కుప్పిలి భీమేశ్వరరావు, క్లోపల్లి స్వర్ణలలిత, మేడా మస్తాన్‌రెడ్డి, రామతాత, కొత్తూరి రమణ, ఆర్.సుబ్బలక్ష్మి తదితరులు కథలు వినిపించారు.



కథ వినిపిస్తున్న మేడా మస్తాన్‌రెడ్డి